## చిట్టి కథ




# బహుమతి

రోడ్డు మీద కారు రాకెట్‌లా వెళ్ళవలసింది పోయి రిక్షాలా వెళుతోంది. సమయం తొమ్మిది గంటలు అవుతుంది. సూర్యుడు అప్పుడే తన వేడి వాడి కిరణాలతో ప్రపంచాన్ని వేడిమయం చేస్తున్నాడు. ఆ రోజే కొత్తగా విడుదలయింది సినిమా. కొత్త పిక్చర్ మొదటి ఆట. అందులో అమితాబ్‌బచ్చన్ హీరో. యిక జనానికి ఏమీ తక్కువ లేదు. తమ ఉద్యోగాలకు సెలవు పెట్టి వచ్చే గుమస్తాలు, గేటు కీపర్లు, ఆఫీసర్లు, కాలేజీ క్లాసులు ఎగరగొట్టి వచ్చే విద్యార్థులు ఏ పనీపాటా లేకుండా తిరిగే హిప్పీ యిజం రోమియోలు, టికెట్ తీసుకునేవారి జేబులు కొట్టే వెధవలు, వారిని పట్టుకునే పోలీసులు, అభిమాన సంఘాల వారు ఒకరేమిటి అన్ని రకాల ప్రజలతోటి నిండి వుంది ఆ విశాలమైన రోడ్డు. జనాన్ని తప్పించుకుంటూ నెమ్మదిగా కారు డ్రైవ్ చేస్తోంది రేఖ. ఆమె కూడా పిక్చర్‌కు బయలుదేరింది. ఇంతకు ముందు ఒంటరిగా ఎప్పుడూ రాలేదు కానీ ఈ రోజు తన ఫ్రెండ్స్ లేకపోవడంతో ఒక్కర్తే రావలసి వచ్చింది.

కారు బస్‌స్టాండ్ సమీపిస్తూ కొంచెం స్పీడు గానే వెడుతోంది. దారిలో రోడ్డు మీద ఒక యువకుడు నిలబడి కారును ఆపమన్నట్టు సైగ చేశాడు. రేఖ కారు స్లో చేసింది. కారు దగ్గరకు రాగానే "ప్లీజ్ కాస్త లిఫ్ట్ యిస్తారా? స్టూడెంట్స్ స్ట్రైక్ కారణంగా బస్సులు నడవటం లేదు" అన్నాడు. అతడు ధరించిన దుస్తులు మాసిపోయి వున్నాయి. తల దువ్వుకుని ఎన్నాళ్ళో అయినట్లుంది. అతనెవరో తనకు తెలియదు. లిఫ్ట్ యివ్వడమా? మానడమా! ఆలోచిస్తోంది రేఖ. అతనెలాంటివాడో! మంచివాడో, మోసగాడో! కొన్ని కొన్ని సినిమాలలోలా తనని తీసుకెళ్ళి ఏ పాడుబడ్డ భవనంలోనో బంధించడు కదా! యిలాంటి మోసాలు, వేషాలు విన్నదిగానీ చూడలేదు. పత్రికల్లో చదివింది. మరి యిప్పుడితనికి సమాధానం ఏం చెప్పాలి? అతని ముఖం వైపు పరీక్షగా చూసింది. అమాయకుడిలా వున్నాడు.

కొందరి ముఖాలు చూస్తే అతడెలాంటివాడో చెప్పెయ్యవచ్చు. ఫరవాలేదు – అనుకుని "సరే, అలాగే!" అంది ముక్తసరిగా. అతడు 'థ్యాంక్స్' చెప్పి వెనుక డోర్ తెరుచుకుని కూర్చున్నాడు. "ఎక్కడికి" అడిగింది రేఖ. "గాంధీనగర్" అన్నాడతను. అబ్బో చాలా దూరం వుందే! ఇతన్ని దించి వచ్చేసరికి సినిమా టైమయిపోతుందే! అని మనసులో అనుకుంది రేఖ. "మీ పేరు" మళ్ళీ అడిగింది. "శంకరం నేను...." మధ్యలో ఆగి పోయాడతను.

"ఆగిపోయారేం? చెప్పండి" అతని వైపు చూస్తూ అంది రేఖ. అతడు చిన్నగా నవ్వి "మిమ్మల్ని చూస్తుంటే అబద్ధం చెప్పలేకపోతున్నాను. నేను యిప్పుడే జైలు నుండి తప్పించుకు వస్తున్నాను. పారిపోయి వస్తున్నాను కదా! ఈ విషయం పోలీసులకు తెలిసేటప్పటికి నేను చాలా దూరం వెళ్ళిపోవాలి. అందుకే మిమ్మల్ని లిఫ్ట్ అడిగాను" అని చెప్పాడతను.

రేఖకు షాక్ తిన్నట్లు అయింది. ఏమిటీ జైలు నుండి పారిపోయిన ఒక ఖైదీకా తను సహాయం చేస్తున్నది? ఒక్కసారి ఒళ్ళు ఝల్లుమంది. చేతులు పట్టు తప్పాయి. కారు స్టీరింగు కంట్రోలు తప్పి పోయింది. అంతే. ప్రక్కన వున్న ఎలక్ట్రిక్ పోల్‌ను గుద్దేసింది. రేఖ హడలిపోయి ఒక్కసారిగా కళ్ళు మూసుకుంది. తరువాత కళ్ళు తెరిచి అంతా పరిశీలనగా చూసింది. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం ఏమీ జరుగలేదు. దెబ్బలు కూడా తగలలేదు. వెనక్కి తిరిగి చూసింది. శంకరం లేడు. ఆశ్చర్యం వేసింది. ఏమయ్యాడు చెప్మా అనుకుంటూ ముందుకు చూసింది. అప్పుడే ఎలా తెలిసిందో ఒక ట్రాఫిక్ పోలీస్ తన స్థూలకాయాన్ని మోసుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు. ఆయాసపడుతూ కారు దగ్గరకు వచ్చి ఆమె పేరు, కారు నెంబరు పుస్తకంపై రాసుకుని 'రేపు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు రండి' అని వెళ్ళిపోయాడు.

పోలీస్ కనుమరుగైన తరువాత ఆ వైపు నుండే కొద్దిసేపటికి శంకరం వచ్చాడు. ఒక్కసారిగా అతని పైన చెప్పలేనంత కోపం వచ్చేసింది రేఖకి. అతని గురించే ఈ అవస్థ అంతా వచ్చింది. అటు పిక్చర్ పోయింది. ఇక్కడ యాక్సిడెంట్. పైగా రేపటినుండి కోర్టు చుట్టూ తిరగాలి. ఇంతలో శంకరం వచ్చేశాడు. అతన్ని నానా చివాట్లు పెడదామనుకుంది. ఎందుకో నోరు పెగల్లేదు.

"సారీ! మీరు నా వల్ల చాలా అవస్థ పడ్డారు. మా ఫ్రెండ్ యిల్లు దగ్గర్లోనే వుంది. అక్కడకు పోతాను" అన్నాడు నవ్వుతూ.

"ఇదిగో మీరు నాకు చేసిన సహాయానికి 'బహుమతి'" అంటూ జేబులో చెయ్యి పెట్టాడు. రేఖ ముఖం మరో వైపుకు తిప్పుకుంది. ముందు సీట్లో వున్న హాండ్‌బ్యాగ్‌లో ఏదో వేసి బ్యాగ్ మూసి సీట్లో పెట్టి వెనుతిరిగాడు. అతను కనుమరుగయ్యేంతవరకు చూస్తూ వుండిపోయింది రేఖ. తరువాత తెప్పరిల్లి కుతూహలంతో బ్యాగ్ తీసి అందులోని 'బహుమతి'ని చూసి ఆశ్చర్యపోయింది. అది తన నెంబరు అడ్రస్ రాసుకున్న ట్రాఫిక్ పోలీస్ 'డైరీ!'

—ఎస్. పద్మావతి